
మీ సమస్యను
ఎవరు
పరిష్కరిస్తారు?

**జీ**వితంలో మనుష్యులు చాలా రకములైన సమస్యలు ఎదుర్కొంటారు. అయితే అన్నింటి కన్నా అతి పెద్ద సమస్య ఒకటి ఉంది. నిజానికి, ఇదే అన్ని సమస్యలకు మూలం. ఇతర సమస్యలన్నీ పాపం అనే ఈ భయంకరమైన సమస్య లేక రోగం యొక్క లక్షణాలే! దేవుడు మన జీవితం యొక్క వాస్తవ సత్యాన్ని తెలుపుతూ ఈ పెద్ద సమస్యను బయలుపరిచాడు. మనుష్యులందరు పాప స్వభావంతో జన్మించారు. "ఏ భేదమును లేదు; అందరును పాపం చేసి దేవుడు అనుగ్రహించు మహిమను పొందలేక పోవుచున్నారు" రోమా 3:23. మానవ జన్మ అనంతరం మొదటి శ్వాసతోనే పాపం తొంగి చూస్తుంది. ప్రతి మనిషి పూర్తిగా స్వార్థంతో నిండి ఉన్నాడు. పసితనం నుండి ముసలి తనం వరకు పాపంలో పెరిగిపోతాడు. పాపానికి ఎన్నో రూపాలు ఉన్నాయి, అది మనిషి ఆలోచనల ద్వారా, ఊహల ద్వారా, కల్పనల ద్వారా, కోరికల ద్వారా, ఉద్దేశ్యాల ద్వారా, చూపుల ద్వారా, మాటల ద్వారా మరియు క్రియల ద్వారా బయటపడుతుంది. "మనుష్యుని లోపలినుండి బయలువెళ్లునది మనుష్యుని అపవిత్రపరచును. లోపలినుండి; అనగా మనుష్యుల హృదయములో నుండి దురాలోచనలును జారత్వములును దొంగతనములును నరహత్యలును వ్యభిచారములును లోభమును చెడుతనములును కృత్రిమమును కామవికారమును మత్సరమును దేవదూషణయు అహంభావమును అవివేకమును వచ్చును. ఈ చెడ్డవన్నియు లోపలినుండియే బయలువెళ్లి, మనుష్యుని అపవిత్రపరచునని ఆయన చెప్పెను" మార్కు 7:20-23.

ప్రతి పాపం మనిషి ఇంకా ఎక్కువగా చెడిపోయేలా చేస్తుంది. కాన్సర్ కణం కన్నా బలంగా పాపం పెరిగిపోతుంది. మనుష్యులు పాపానికి బానిసలై, దాని ఎదిరించలేక దాని ప్రభుత్వానికి లోబడతారు. ప్రభువైన యేసు చెప్పారు, "పాపం చేయు ప్రతి వాడును పాపమునకు దాసుడని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను" యోహాను 8:34. ఆ తరువాత మనుష్యులు అకస్మాత్తుగా చనిపోయి, తీర్పులోనికి వెళ్లి నిత్య నాశనానికి పోతారు. దేవుడు చెప్పింది జ్ఞాపకం చేసుకోండి, "ఏలయనగా పాపమువలన వచ్చు జీతం మరణము" రోమా 6:23. పాపములో చనిపోయేవారు నిత్యమైన అగ్ని గుండములోనికి వెళ్లి అంతము లేని యుగ యుగాలు శ్రమ అనుభవిస్తారు. ఇది రెండోవ మరణము.

తమను పీడించే పాపపు సమస్య నుండి బయటపడ్డానికి మనుష్యులు ఎన్నో పరిష్కార మార్గాలు వెదకుచున్నారు. తమ అసంఖ్యాకమైన పాపములను పోగొట్టుకునేందుకు వారు మతాన్ని ప్రయత్నిస్తారు, కష్టతరమైన దీక్షచేస్తారు, పశ్చాత్తాపపడతారు, మంచి పనులు చేస్తారు, పుణ్యం చేస్తారు, ధ్యానం చేస్తారు, స్వనిగ్రహ సాధనలు చేస్తారు, నాస్తిక వాదాన్ని ఎంచుకుంటారు. కాని అది వారి వల్ల కాదు! మనిషి అంత సులువుగా పాపాన్ని చెరిపేయలేడు, తుడిపేయలేడు, తొలిగించలేడు! "మేమందరము అపవిత్రులవంటివారమైతిమి మా నీతిక్రియలన్నియు మురికిగుడ్డవలె నాయెను" యెషయా 64:6. ప్రాయశ్చిత్తం ద్వారా లేక వెలుపటి పవిత్రత ద్వారా దైవానుగ్రహం పొందవచ్చని, తద్వార పాప క్షమాపణ, ఆత్మ రక్షణ, పరలోకము దొరుకుతుందని ఈ లోకములోని అనేక మతాలు మరియు సిద్ధాంతాలు బోధిస్తున్నాయి. అది ఏ మాత్రం నిజం కాదు! "నా యందు, అనగా నా శరీరమందు మంచిది ఏదియు నివసింపదని నేనెరుగుదును. మేలైనది చేయవలెనని కోరిక నాకు కలుగుచున్నది గాని, దానిని చేయుట నాకు కలుగుట లేదు" రోమా 7:18.

ప్రతి మనిషి పాపం చేత మలినమైపోయాడు కనుక అతడు చేసేది ఏది పరిశుద్ధ దేవుని ఎదుట పవిత్రమైనదిగా లేక మంచిదిగా ఎంచబడదు. మన పాపం వలన మన మనస్సులు చెడిపోయాయి, హృదయాలు చెడిపోయాయి, ఆత్మలు మరియు దేహాలు చెడిపోయాయి. మన మనస్సులు నెమ్మది కొరకు, మన హృదయాలు ప్రేమ కొరకు, మన ఆత్మలు ఉద్దేశ్యము కొరకు, మనం నిజమైన తృప్తి కొరకు పరితపిస్తూ ఉన్నా, ఈ ప్రపంచములో ఎక్కడా అవి మనకు లభించవు! పాపం మూలంగా మనుష్యులు లోలోన కుళ్ళి పోతున్నారు. ఈ లోకంలో నరకాన్ని అనుభవిస్తాము, తరువాత నిత్య నరకంలో శిక్ష పొందుతాము.

దేవుడు సంపూర్ణుడు, నిర్మలుడు, పరిశుద్ధతలో అతీతుడు. మానవుడు పాపంలో పడి దేవునికి దూరమైనప్పుడు, పాపం యొక్క ఫలితంగా మరణము మరియు నాశనము కలిగాయి. పరిశుద్ధుని యొక్క రక్తము చిందించబడకుండా పాపికి ప్రాయశ్చిత్తము జరుగదు, పాప క్షమాపణ కలుగుదు. ఆ ప్రేమగల దేవుడు మనకు బదులుగా తన ప్రియ కుమారుడైన యేసును మన కొరకు బలిగా అర్పించాడు. మనిషిని పాపము నుండి, నరకము నుండి విమోచించుటకు దేవుడు నరుడైయ్యాడు. యేసు పాపము

లేకుండా కన్య గర్భాన జన్మించి, పాపము లేకుండా జీవించి, సిలువపై మన పాపం మోశాడు. ఆయన మన పాపాన్ని, మన అవమానాన్ని, మన శ్రమను, మన శిక్షను భరించి, మన రక్షణ కొరకు తన ప్రశస్త రక్తమును చిందించాడు. ఆయన మరణించి, సమాధి చేయబడి మరల మూడవ రోజున తిరిగి లేచాడు! ఆయన గొప్ప విమోచన కార్యమును బట్టి ఆయన యందు విశ్వాసముంచి, యథార్థముగా తన పాపములు ఒప్పుకును వాడు క్షమించబడును. అతడు భవిష్యత్తులో నరకము నుండి ఇప్పడు నిరర్థకమైన జీవితము నుండి రక్షింపబడును. మన రక్షణకు, నిత్యత్వానికి యేసే నిరీక్షణ. "మరి యెవనివలనను రక్షణ కలుగదు; ఈ నామముననే మనము రక్షణ పొందవలెను గాని, ఆకాశము క్రింద మనుష్యులలో ఇయ్యబడిన మరి ఏ నామమున రక్షణ పొందలేము అనెను" అపొస్తలుల కార్యము 4:12. " అయితే దేవుని కృపావరము మన ప్రభువైన క్రీస్తుయేసు నందు నిత్యజీవము" రోమా 6:23. మీ సమస్యను ఎవరు పరిష్కరించగలరో ఇప్పడు మీరు ఎరుగుదురు! మరి ఆలస్యం దేనికి? హృదయపూర్వకముగా పశ్చాతాపముతో మీ పాపమును ఒప్పకుని దానిని విడిచిపెట్టిండి. ప్రభువైన యేసు నందు విశ్వాసముంచి రక్షణ పొందండి. "మీరు విశ్వాసము ద్వారా కృపచేతనే రక్షింపబడి ఉన్నారు. ఇది మీవలన కలిగినది కాదు, దేవుని వరమే" ఎఫెసీ. 2:8. మీ జీవితాన్ని ప్రభువైన యేసుక్రీస్తుకు సమర్పించి, సమృద్ధిగల జీవాన్ని అనుభవించండి.

## ప్రార్థన మరియు సలహాల కొరకు :

**విక్టరీ వర్షిప్ సెంటర్**
తాడ్‌బండ్ X రోడ్స్
సికింద్రాబాద్.
e-mail : vwc@victorybibleministries.org.

* లేఖనాలు అన్నియు పరిశుద్ధ బైబిల్ గ్రంథములో నుండి తీసుకొనబడినవి.

©copyright vbm 2016.